# అనుకూల శత్రువు

మల్లీశ్వరి



"మల్లీ! ఇలా మొండికేస్తే ఎలా చెప్పు? త్వరగా తయారుకావాలి. అవతల అబ్బాయివాళ్ళు ఎదురు చూస్తున్నారు" తొందర పెట్టింది రాజమ్మ.

"నాకీ పెళ్ళిచూపులొద్దు వదినా. బొమ్మలా తయారై వాళ్ళెదుట కూర్చుని అడిగే వెగటు ప్రశ్నలకి జవాబివ్వలేను" అద్దం ముందు కూర్చుని. విరబోసుకున్న వెంట్రుకల్ని చేత్తో మెలిపెడ్తూ అంది మల్లిక.

"ఇప్పటికి డజనుసార్లు ఇలా బొమ్మలా కూర్చున్నాను అందరూ పుత్తడిబొమ్మ అనే వారే కాని ముందుకొచ్చి పెళ్ళి చేసుకుంటా నన్నదెవరు? నాలో లోపం లేకపోయినా ఈ శాపం ఎందుకో? పోనీతే కక్కొచ్చినా కళ్యాణ మొచ్చినా ఆగదంటారు కదా ఆ గడియే రానీ అప్పుడే జరుగుతుంది నా పెళ్ళి. అంత వరకు నాకీ పెళ్ళిచూపులే వద్దు. ఎవడో వాడు నేరుగా వచ్చి నన్ను చేసుకుంటా ననే వరకు ఇక పెళ్ళి చూపుల్లో కూర్చోను" చిరు కోపంతో భీష్మించు కూర్చుంది మల్లిక.

"అవున్లే మల్లీ! ఇదే మీఅమ్మయితే మాట వినక పోయేదానివా! నేనుకేవలం వదిన్ని. కళ్ళల్లో పెట్టి కాపాడినా సవతి తల్లిలాంటి దాన్నేగా! కనీసం మీ అన్నయ్యనైనా చూడు....నీ కోసం ఎంతో కష్టపడి ఈ సంబంధం తెచ్చారు. మా పైన ఏమాత్రం గౌరవం వున్నా ఒప్పుకో!" నిష్ఠూర పర్చింది రాజమ్మ.

"అయ్యయ్యో అంత మాటనకు వదినా! అమ్మ ఎలావుంటుందో తెలియదు గాని నీవు అంతకన్నా గొప్ప దానివి. నీ ఇష్ట ప్రకారమే కానీ" అంటూ తల దువ్వుకో నారంభించింది.

మల్లికను, పెళ్ళికొడుకు కుమార్‌ను వంటరిగా వదలి పెద్దలంతా వరండాలో లోకాభి రామాయణం చర్చిస్తూ కూర్చున్నారు.మల్లిక తేనె కళ్ళలోని కాంతులకు విస్మయం చెందాడు కుమార్. మచ్చలేని చంద్రమామలాటి మోము, మల్లెలు విరిసే చిరునవ్వు, వెన్నెల కురిసే సోయగం, అచ్చు బాపుబొమ్మలాటి మల్లికను చూస్తూ తన్మయత్వంలో మునిగిపోయాడు కుమార్.

అందం, ఆస్తి,అంతస్తు అన్నీవున్నా నిరాడంబరంగా వున్న కుమార్‌ను చూసి ముచ్చట పడింది మల్లిక.

ఇద్దరూ ఒకర్నొకరు ఒప్పుకునే సరికి ముహూర్తాలు నిశ్చయించారు.

మల్లిక ఆ ఊళ్ళోనే ఓ ప్రభుత్వ సంస్థలో పన్జేస్తోంది. బాల్యంలోనే తల్లి, దండ్రుల వియోగం సంభవించగా అన్నయ్య భాస్కరం, వదిన రాజమ్మ సంరక్షణలో పెరిగింది. మల్లికకు ఎన్నో సంబంధాలు చూశాడు భాస్కరం. అందరూ మల్లిక సౌందర్యాన్ని మెచ్చు

కుని 'మళ్ళీ తెలియజేస్తాం' అని వెళ్ళిన వారు వెళ్ళినట్లే "మరో సంబంధంచూసు కోండి" అని రాసేవారు. భాస్కరానికి అందుకు కారణ మేమిటో అనూహ్యం గానే వుండి పోయింది. కొందరు కట్నం దగ్గిర వెనక్కు పోతే, మరికొందరు ఏ కారణము లేకనే వద్దనేవారు.

ఎవరు కాదన్నా మల్లికను చేసుకోవ డానికి సదా సిద్ధంగా వున్నాడు నాగరాజు. రాజమ్మ తమ్ముడుతనతమ్మునికిచ్చిచేయా లని రాజమ్మ ఒకటి, రెండుసార్లు అంది భాస్కరానితో....అందుకు అతడు సుము ఖత చూపకపోగా కోపగించుకున్నాడు. నాగరాజు రూపంలోనే కాక, గుణంలోనూ మల్లిక కాలి కొన గోటికి కూడా సరి పోలడు.....అతడు సకల దుర్గుణ సంప న్నుడు....ఇటీవలే స్మగ్లింగ్ కేసులో పటుబడి విడుదలయ్యాడు— జులాయిగా తిరిగే అలాటివాడికిచ్చి చెల్లెలి జీవితంలో విషం క్రుమ్మరించలేదు భాస్కరం.

రాజమ్మకు మాత్రం ఓ చెంప మనసు పీకుతూనే వుంది—మల్లిక నిచ్చి చేస్తే నాగరాజు బాగుపడ్తాడని ఆవిడ ఆశ— అప్పుడప్పుడు భాస్కరం ఇంటి కొచ్చే వాడు నాగరాజు. ఓరోజు మధ్యాహ్నం మల్లిక తల నొప్పితో అఫీసుకు పోలేదు. భాస్కరం ఆఫీసుకు-రాజమ్మ మ్యాట్నీకి వెళ్ళడంవల్ల ఆ రోజు మల్లిక వంటరి గానే వుంది....అదను చూసి వచ్చిన నాగరాజు మల్లిక కన్యత్వాన్ని దోచుకో బోయాడు—ఈవెనింగ్ సెషన్ ఎవరో మంత్రిగారు చనిపోవడంవల్ల రద్ద యింది—అందుకని భాస్కరం వెంటనే ఇంటికొచ్చేశాడు. ఆఫీసునుంచి సరిగ్గా అదే సమయంలో నాగరాజు కబంధ హస్తాల్లో గిలగిల తన్నుకుంటున్న తన చెల్లెలు కనపడింది—నాలుగు తన్ని నాగరాజుని తరిమి కొట్టాడు భాస్కరం. అప్పట్నుంచి నాగరాజు భాస్కరం వున్నపుడు ఆ ఇంటి ఛాయలకే రావడం మానుకున్నాడు.... భాస్కరం లేనపుడు మాత్రం వచ్చి అక్కతో మాట్లాడి జేబు ఖర్చులకు డబ్బు పట్టుక పోయేవాడు.

* * *

ఆఫీసులో మల్లిక, లత వాళ్ళ వాళ్ళ పన్లో నిమగ్నమై యున్నారు. అప్పుడే వచ్చిన పోస్టుమేన్ మల్లికకు ఓ కవ రిచ్చి వెళ్ళాడు. ఫ్రం అడ్రసు చూస్తే కుమార్ పేరు వుంది— ఆత్రుతతో చించి చదివింది—

మల్లికా!

ఇలా రాయాలొస్తుందని తలంచ నైనా లేదు. నన్ను అపార్థం చేసుకోక పూర్తిగా చదువు—ఆ రోజు నిన్ను చూసి వచ్చినప్పటినుంచి నా మనసు మనసులో లేదు— నా ఊహలన్నీ నీ చుట్టూ పరిభ్రమించాయి. ఆ తియ్యటి తలపుల్ని చెదరివేస్తూ ఇప్పుడు నాకో ఉత్తరం వచ్చింది—అది చూసినప్పటి నుంచి నా మనసంతా ఎలాగో ఐపో యింది. నీకు చెడు తిరుగుళ్ళున్నాయని, నీవు ఏనాడో కన్యత్వాన్ని కోల్పోయా వని ఆ ఉత్తరంలోని సారాంశం—నా కది నమ్మాలనిపించకపోయినా అను మానం ప్రాణసంకటం కదా! అందుకని నేను నిన్ను నేరుగా కల్పుకుని, సందేహ నివృత్తి చేసుకోవాలను కున్నాను. ఎవరు కానీ తన జీవిత భాగ స్వామి పవిత్రంగా వుండాలని కోరు కోవటం తప్పు కాదుకదా! నీ సౌందర్యా నికి —సద్గుణం అబ్బితే బంగారానికి సువాసన వచ్చినట్లే కదా! అలాటిదాని

వనే నిన్ను నే కోరుకున్నాను. — రేపు నిన్ను కలుసుకున్నపుడు, నీవు అమాయకురాలని తెలియజేస్తే చాలు. నేను నమ్ముతాను. — అందుకని రేపు నాకు ఏం చెప్పదల్చుకున్నావో నిర్ణయించుకో! అందమైన అబద్ధం కన్నా నిప్పులాంటి నిజమే నా కిష్టం — మరిక సెలవ్! -కుమార్

ఉత్తరం చదివిన మల్లికకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"చూడండి!" అంటూ లతే మొదలు పెట్టింది. కుమార్ ఆసక్తిగా లత వైపు చూపులు మరల్చాడు.

"మా మల్లిక ఎలాటిదో నాకు తెలుసు: మా ఐదేండ్ల పరిచయంలో వేలెత్తి చూపించే చెడ్డ పని తనేం చేయలేదు — మీరు ఎంతో ఉన్నతులు - సంస్కారవంతులు- అందుకు ముఖాముఖి చర్చించడానికి వచ్చారు - అందుకు మాకెంతో సంతోషంగా వుంది: మల్లికకు కానివారు, తన పెళ్ళయితే నష్టపోయేవారు ఎవరో రాశారు. ఆ ఉత్తన్ని - మల్లిక అమాయకురాలు - మీ ఉత్తరం అందినప్పట్నుంచి, అన్నం "నీళ్ళుముట్టకుండా ఒకటే ఏడుపు- కళ్ళు వాచిపోయాయి! తను ఎవరికీ ద్రోహం చేయకపోయినా తనపై ఎవరో కక్ష కట్టారు — నేను కేవలం స్నేహితురాలుగా కాక, సొంత చెల్లెల్లా చెబుతున్నాను.

మల్లిక ఎవర్నీ ప్రేమించనూ లేదు. మరేమీకానూ లేదు... వాళ్ళ అన్నయ్య వదినల సంరక్షణలో సలక్షణంగా పెరిగింది.... ఇది మీరు నమ్మినా. నమ్మకపోయినా.... పచ్చినిజం...." ఉద్వేగంగా అంది లత—

జాంగ్రీ సుతారంగా కొరుకుతున్న కుమార్ "ఎంత తియ్యటి నిజాన్ని విన్నాను.... మల్లికను చేసుకోబోయే నేను నిజంగా అదృష్టవంతుణ్ణే?" అన్నాడు సంతోషంతో.

అంతవరకు ఏమీ తినకుండా ప్లేట్లో చేయి పెట్టి కెలుకుతున్న మల్లిక కళ్ళు ఆనందంతో వర్షించాయి.... కృతజ్ఞతా పూర్వకంగా కుమార్ వైపు చూసింది.

మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటలకు భాస్కరం, మల్లికలు ఆఫీసుకు పోయే గొడవలో వున్నారు. లక్ష్మి అప్పటికే జూనియర్ కాలేజీకి వెళ్ళిపోయింది రాజమ్మ భాస్కరానికి, మల్లికకు క్యారియరు సర్దసాగింది వంటింట్లో.

"టై కోసం తెగ వెదకసాగాడు భాస్కరం... ఓ వైపు టయిమైపోతున్నా 'టై' దొరక్క బాగా చిరాకుపడిపోయాడు మల్లిక అన్ని సూట్‌కేసులూ అయిపోగా రాజమ్మ సూట్‌కేస్ వెదకసాగింది టై కోసం. ఏమయితేనేం మల్లిక తుదకు రాజమ్మ సూట్‌కేస్ నుండి టైని వెలికి తీసింది, ఆ టైతో బాటే ఓ కవరూ, ఓ బ్యాంక్ పాసుబుక్కూ- మల్లిక కంట పడింది.... పాసుబుక్కులో రాజమ్మ పేర పదివేలుంది — అందులోనే వున్న కవర్ను చూసింది మల్లిక — పైన కుమార్ అడ్రసు రాసి వుంది. ఫ్రం అడ్రసు లేదు— అవి వదిన అక్షరాల్లా వున్నాయి—తనెందుకు కుమార్‌కు ఉత్తరం రాస్తుందబ్బా అనుకుంటూ అంటించని ఆ కవరులోని ఉత్తరాన్ని వెలికితీసి యథాలాపంగా చూసింది.

"కుమార్ గారికి,

కొద్ది రోజుల క్రితం మీకు అందిన ఉత్తరంలోనివన్నీ అబద్ధాలని, తనుఅమాయకురాలని మల్లిక చెప్పినట్టు తెలుస్తూంది— అతికినట్టు అబద్ధం చెప్పడం

ఓ కళ — నిజం చెప్పాలంటే నాకూ— తనకూ సంబంధం వుంది.... మరి నేనెవర్నో అని తెల్సుకోడానికి మాత్రం ప్రయత్నించకండి— అన్నీ తెల్సి ఈ ఊబిలోకి మాత్రం మీరు దిగరు— దిగరాడని భావిస్తున్నాను. కోరుతున్నాను-

ఇట్లు- మీ శ్రేయోభిలాషి

(సంతకం లేదు)

"అవును.... ఈ అక్షరాలు అక్షరాలా వదినవే! తనను ప్రాణంలో ప్రాణంగా చూసుకునే వదినవే. ఇది నమ్మక పోవడం ఎలా? వదిన ఎందుకు తేనె పూసిన కత్తిలా ప్రవర్తించింది— తనకు తనే ద్రోహం చేసిందని ఈ విధంగా తనపై కత్తి కట్టింది" ఒక చేతితో పై. మరో చేతితో ఉత్తరంపట్టుకున్న మల్లిక ఆలోచనల హోరులో పిచ్చిదైపోయి "అన్నయ్యా!" అంటూ గట్టిగా కేక పెట్టింది—

"ఏమ్మా? ఏమైంది?" అంటూ ఆత్రముగా పరిగెత్తుకొచ్చిన భాస్కరం, మల్లిక చేతిలోని ఉత్తరాన్ని తీసుకున్నాడు. పూర్తిగా చదివి ఎవరు రాశారో అర్థం చేసుకున్నాడు.... కోపంతో ఊగిపోయారు

ఒక్క ఊపున రాజమ్మపైకి వచ్చాడు భాస్కరం, ఆమె చెంపలు రెండూ బూరెల్లా వాచిపోయాయి రెండు క్యారియర్లు అల్లంత దూరంలోపడి దొర్లిపోయాయి.

మౌనంగా ఏడుపు లంకించుకుంది రాజమ్మ—గోడకు తగిలి ఆమె నుదురు చిట్లింది.

"నన్ను చంపేయండి .... నేను పాపిష్టిదాన్ని"

"హుఁ! నిన్ను చంపను....నువ్వు శత్రువుకాదు.... అనుకూల శత్రువు.... ప్రేమనటించి నా చెల్లెలి గొంతు కోయాలనుకున్నావు....నిన్ను కత్తికొక కండగా చేసి చిత్రవధ చేస్తాను" కోపం తారస్థాయి నందుకుంది. నడుముకున్న బెల్టుతీసి వాతలు పడేటు కొట్టాడు.

ఇంతలో మల్లిక తేరుకుని అడ్డుగా వచ్చి నిల్చుంది.

"నువ్వు జరుగు మల్లీ....దాని అంతం చూస్తానీవేళ"

"అన్నయ్యా తనేదోచేసిందని నీవూ అజ్ఞానంతో ప్రవర్తిస్తావా! ఎవరి పాపం వారికుంటుంది. వదినను వదిలెయ్!" ప్రాధేయపడింది మల్లిక భాస్కరం చేతులు పట్టుకుని.

"అమ్మా! మల్లికా! నీకు తీరని ద్రోహం చేశాను....నన్ను కసితీరా కొట్టనీ! నేను చచ్చినా నా తప్పుకు శిక్ష చాలదు....ఆకాశరామన్న ఉత్తరాలు రాసి నీ జీవితానికే మచ్చ తెచ్చాను.... నిన్ను ఎవరూ పెళ్ళి చేసుకోక పోతే తుదకు నాగరాజునే నీకు కట్టబెట్టవచ్చునని దురాలోచన చేశాను....అంతవరకు నీ జీతం బ్యాంకులో వేస్తూ వేలకు వేలు ప్రోగు చేసుకోవచ్చునని కలలుకన్నాను. ఆరోజు నీకు....నాగరాజుకు ఏకాంతం కల్పించింది....నాగరాజును నీపైకి పురికొల్పింది నేనే! ఆరోజే మీ అన్నయ్య ఆఫీసు నుంచి సమయానికి రాకపోతే నాగరాజు చేతుల్లో నీ జీవితం నలిగిపోయి వుండేది....నీ బంగారు భవిష్యత్తును మట్టిపాలు చేయడానికి ప్రయత్నించిన నేను క్షమార్హురాలిని కాను....నన్ను చంపేయనీ.... దేవుడుకూడా నన్ను క్షమించడు" అంటూ అలాగే మల్లిక పాదాలపై స్పృహ తప్పి పడిపోయింది రాజమ్మ.

●